క్లుప్తంగా

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

రాజాం: పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రీ కాలనీ వరకు చేపడుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనుల వల్ల తాగునీటి పైప్ లైన్లు పాడయ్యాయి. దీంతో మెంతిపేట కాలనీ, మల్లికార్జున కాలనీలకు ఆదివారం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీ వాసులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజాం: మండలంలో వీఆర్ అగ్రహారం, గడిముడిదాం, కంచరాం, తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఓ సాయిరాం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ, పలు సూచనలు చేశారు. పని ప్రదేశంలో తాగునీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

కొలతలు ప్రకారం పనిచేయాలి..

రేగిడి: కొలతల ప్రకారం ఉపాధి పనులు చేస్తే ప్రతి ఒక్కరికీ రోజుకు కనీస వేతనం రూ.272 వస్తుందని ఏపీఓ హరనాథరావు అన్నారు. మండలంలోని తోకలవలస, లచ్చన్నవలస గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మస్టర్లలో లొసుగులు ఉంటే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు రిలీవ్ ఆర్డర్లు



రిలీవింగ్ ఆర్డర్లు ఇస్తున్న ఎంఈఓ నాగయ్య

రాజాం: మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసి ఇటీవల బదిలీపై ఇతర మండలాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు రిలీవింగ్ ఆర్డర్లను ర్లు ఎంఈఓ పొంద్రంకి నాగయ్య శనివారం అందించారు. అలాగే ఇతర మండలాల నుంచి రాజాం వచ్చిన ఉపాధ్యాయులు ఎంఆర్సీ కార్యాలయం వద్ద జాయినింగ్ రిపోర్టులు అందజేశారు.

నేడు రేగిడిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

రేగిడి: మండల కేంద్రంలోని విశ్వసాయి మందిరంలో ఆదివారం ఉదయం 8 గంటలకు ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈశిబిరం జరుగనుందని, కంటి సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పేదవాడి సొంతింటి కల సాకారం


చల్లపేటలో నిర్వహించిన హౌసింగ్ డేలో ఎంపీడీఓ త్రివిక్రమ్

మెంటాడ: ప్రతీ పేదవాడి సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తోందని ఎంపీడీఓ త్రివిక్రమ్ అన్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని చల్లపేట గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించిన ఆయన ఇళ్ల స్థలాలు, ఇళ్ల స్థలం చూపించిన వారికి ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లబ్ధిదారులంతా నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు.

బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు

మెంటాడ: ఉపాధి హామీ పనులకు సంబంధించి, బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ త్రివిక్రమ్ హెచ్చరించారు. శనివారం మండలంలోని చల్లపేట, ఇద్దనవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన కొంతమంది క్షేత్ర సహాయకులు వలస పోయిన వారికి, మరణించిన వారి పేరు మీద మస్తర్లు వేసి, డబ్బులు విత్‌డ్రా చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇవే ఆరోపణలు రుజువైతే చర్యలకు వెనకాడేది లేదన్నారు. జాబ్‌కార్డు ఉండి, పనిలోకి వచ్చిన వారికి మాత్రమే మస్తరు వేయాలని తెలిపారు.

జగనన్న భూ హక్కు పథకం రైతులకు వరం

రేగిడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న శాశ్వత భూ హక్కు పథకం రైతులకు వరమని తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి అన్నారు. మండలంలోని కాగితాపల్లిలో భూ హక్కు పథకంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వే వల్ల కలిగే లాభాలను వివరించారు. అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్లు, వీఆర్ఓలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సచివాలయం–1 పరిధిలో ఉన్న సంతతోట, పూడి, పెదపల్లి, పొందూరు వీధుల్లో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేయగా, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. టీడీపీ నాయకులు వారి హయాంలో ఏం అభివృద్ధి చేశారో, ఏ పథకాలు అమలు చేశారో చెప్పకుండా విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. దమ్ముంటే వారు ప్రజలకు ఏం మేలు చేశారో వివరిస్తూ జనంలోకి వెళ్లాలని సవాలు విసిరారు. ఒకప్పుడు రాష్ట్రంలో ఉచిత పథకాలు ఎక్కువై పోతున్నాయని, ఇవే కొనసాగితే రాష్ట్రం మరో శ్రీలంక, సోమాలియా, ఉక్రెయిన్ అవుతుందన్న చంద్రబాబే ఇటీవల జరిగిన టీడీపీ మహానాడులో ఉచిత పథకాలతో మేనిఫెస్టో ఎలా విడుదల చేశారని ప్రశ్నించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ అందజేస్తున్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు అబద్ధపు హామీలను ఎవరూ నమ్మడం లేదన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. 2024లోనూ వైఎస్సార్ సీపీకే ప్రజలు బ్రహ్మరథం పడతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల నాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ప్రారంభం


భూమి పూజ చేస్తున్న సర్పంచ్, తదితరులు

రేగిడి: మండలంలోని పెద్దశిర్లాంలో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి సర్పంచ్ లెంక రాంబాబు శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత టీడీపీ పాలనలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినా ఎవ్వరూ పట్టించుకోలేదని... ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 16 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చొరవతో నిధులు మంజూరయ్యాయన్నారు. పంచాయతీ కార్యదర్శి అనిత, పాఠశాల హెచ్‌ఎం చిన్నంనాయుడు, పీఎంసీ చైర్మన్ ఆదినారాయణ, అంగన్‌వాడీ టీచర్ ప్రమీలారాణి, లెంక నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

బాడంగి: మండలంలోని ముగడ గ్రామ కేశయ్య వీధిలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, అంకురార్పణ, పంచగృహప్రాసన పూజలతో పాటు, ఉత్సవ విగ్రహాల తిరువీధి చేపట్టారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొని, రాముడికి పూజలు చేశారు. రాత్రి ప్రదర్శించిన శ్రీరామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర కాటిసీను నాటిక చూపరులను ఆకట్టుకున్నాయి.

చురుగ్గా మరుగుదొడ్ల నిర్మాణ పనులు


మరుగుదొడ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ పార్వతి

తెర్లాం: మండలంలోని చీకటిపేట గ్రామ సచివాలయం వద్ద మరుగుదొడ్ల నిర్మాణ పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. శనివారం ఆ పనులను సర్పంచ్ మూడడ్ల పార్వతి పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు జరగాలని సూచించారు. జియోట్యాగింగ్, బిల్లులు చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జోరుగా 'ఉపాధి' పనులు


తెర్లాం ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్న వేతనదారులు

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద కేంద్రం) వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఏపీఓ సుశీల కలిసి, శనివారం పరిశీలించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని, చల్లగా ఉన్నప్పుడు మాత్రమే పనికి వెళ్లాలని వారు వేతనదారులకు సూచించారు. నిర్దేశిత కొలతల్లో పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు.

బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలుపుతున్న డీటీ గౌరీశంకరరావు

బొబ్బిలి: మండల తహసీల్దారుగా డోల రాజేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు డిప్యూటీ తహసీల్దారు బలివాడ గౌరీశంకరరావు, తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

టారిఫ్ బోర్డుల ఏర్పాటు తప్పనిసరి


సాయి ఆస్పత్రిలోని ఓపీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజులకు సంబంధించిన టారిఫ్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను, స్కానింగ్ యంత్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డెంగీ, మలేరియా, తదితర కేసులు నమోదైతే డీఎంహెచ్ఓ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

జేవీకే కిట్ల పంపిణీకి చర్యలు

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వివిధ పాఠశాలలకు జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్లను పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని మొత్తం 48 పాఠశాలలకు పాఠశాలల పునఃప్రారంభం రోజునే వీటిని అందించేలా చూస్తున్నామని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

బాడంగి: జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు బోధన, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల విద్యాప్రగతికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాజాం సిటీ: మండల పరిధిలోని పొగిరి ఫ్యాక్టరీ ఏరియాతో పాటు పొగిరి గ్రామానికి ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వి. సురేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన

సంతకవిటి: మండలంలోని అక్కరాపల్లిలో రామాలయం పునఃనిర్మాణానికి సంబంధించి వేద పండితుడు పులంఖండి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో గ్రామస్తుల శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పూర్తయిన అండర్ డ్రైనేజీ పనులు

రాజాం: పట్టణంలో అండర్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. రూ. 20 కోట్లతో గాయత్రీ కాలనీ నుంచి బొబ్బిలి జంక్షన్‌వరకు రోడ్డు విస్తరణ, అండర్ డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. ఓ పక్క రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా జరుగుతుండగా.. డ్రైనేజీ పనులు మాత్రం పూర్తయ్యాయి.

చిత్రలేఖనంపై శిక్షణ


తాము గీసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

తెర్లాం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనంపై శనివారం శిక్షణ ఇచ్చారు. ప్రతీ విద్యార్థి బొమ్మలు గీయడం నేర్చుకోవాలని, భవిష్యత్‌లో సైన్స్ సబ్జెక్ట్ తీసుకునే వారు బొమ్మలు గీసేందుకు ఇది ఉపకరిస్తుందని విశ్రాంత ఎంఈఓ ఎం.సత్యనారాయణ, లైబ్రేరియన్ కృష్ణమూర్తి అన్నారు. అనంతరం విద్యార్థులు వేసిన చిత్రాలను ప్రదర్శించారు.

శిక్షణ తరగతులతో ఎంతో ప్రయోజనం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్

డెంకాడ: శిక్షణ తరగతులు సాంకేతిక విద్యాబోధనకు ఎంతో ప్రయోజనంగా ఉంటాయని ఏయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్టీ–సెర్బ్ సహకారంతో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో డిజైన్ అండ్ సిములేషన్ ఆఫ్ మినియేచర్ యాంటెనా యూజింగ్ మెషిన్ లెర్నింగ్ ఫర్ ఐఓటీ అప్లికేషన్స్ అనే అంశంపై ఆరు రోజుల పాటు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఈ రాడార్ అంటెన్నాస్ అండ్ కంపోనెంట్స్ డివిజన్ సైంటిస్ట్ కె.సాంబశివరావు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డీన్ సునీల్‌ప్రకాష్, కార్యక్రమం కో ఆర్డినేటర్ ఎం.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, డీన్ ఆర్. రమేష్, హెచ్ఓడీ షేక్‌మస్తాన్ వలీ, ఇతర విభాగాలకు చెందిన అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

బొబ్బిలి: డివిజన్ పరిధిలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, సబ్‌స్టేషన్ పరిధిలోని లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులను ఈ నెల 12వ తేదీన చేపడుతున్నామని ఏఈ ఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలువరాయి, బలిజిపేట ఫీడర్ పరిధిలోని పిరిడి, జగన్నాథపురం, పెంట, పినపెంకి, వంతరాం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

వ్యవసాయ ప్రణాళికలు రూపొందించాలి


వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ప్రతి గ్రామంలో ముందస్తుగా రైతు సమావేశాలు నిర్వహించి వ్యవసాయ ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు కోనారి అప్పారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సాగుకు రైతులను సమాయత్తం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం రాజాం మండలంలో సాగు వివరాలు, సాగునీటి వనరుల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీపీ కె.చంద్రరావు, ఏఓ రేణుకాసాయి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జెడ్పీటీసీ సభ్యుడు బండి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకరరావు

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా స్థానిక మార్కెట్‌లో ఆదివారం నిరసన చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న తెలిపారు. ఇదే విషయమై స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు కాసేపు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని, వాటిని వ్యతిరేకించేందుకు సిద్ధం కావాలన్నారు.

గ్రామాల్లో రైతు సదస్సులు


వెంకమ్మపేటలో రైతు సదస్సు నిర్వహిస్తున్న ఏఓ, తదితరులు

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి జి. మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం రైతు సదస్సులు నిర్వహించారు. వెంకమ్మపేట, తునివాడ, పాత చెలికానివలస, కొత్త చెలికానివలస గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల వద్ద ఈ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. రైతులను ఖరీఫ్‌కు సన్నద్ధం చేయడంతో పాటు ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ విజయలక్ష్మి, వీఏఏలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కళాశాలల తనిఖీ


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఆర్ఐఓ

రాజాం సిటీ: పట్టణంలోని పలు జూనియర్ కళాశాలలను ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ శనివారం తనిఖీ చేశారు. ఎస్ఎల్‌టీఎస్, నారాయణ, గాయత్రి కళాశాలలతో పాటు రామా ఒకేషనల్ కళాశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కళాశాలలను నిర్వహించాలని ఆదేశించారు.

యుద్ధప్రాతిపదికన బోరు మరమ్మతులు


బోరు బాగు చేస్తున్న మెకానిక్‌లు

తెర్లాం: వేసవి నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా మండలంలోని చీకటిపేట పంచాయతీ, మోదుగువలస గ్రామంలో బోర్లు మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. శనివారం సర్పంచ్ మూడడ్ల పార్వతి ఆధ్వర్యంలో మెకానిక్‌లు బోర్లు బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం రేపు

బాడంగి: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఇన్‌చార్జ్, కమిటీ కన్వీనర్ రాజారమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.